


“చూడు మిస్టర్! ఆ ముందు ‘అర్ష రసాయనశాల’ అని మందుల కొట్టుంది. అక్కడ ఆపేయ్” అంటూ చిక్కడపల్లి పంతెన ఎక్కగానే చెప్పాడు రామయ్యగారు ఆటో డ్రైవర్‌తో.

“అచ్ఛా సాబ్!” అంటూ ఆ ఆటో డ్రైవరు రహీం, గేరు మార్చి స్లోగా పోనిచ్చాడు.

అర్ష రసాయనశాల ముందు ఆటో ఆగింది.

బట్టల పేకెట్లు, రెండు చేతి

సంచులు పుచ్చుకుని రామయ్యగారు దిగి డ్రైవర్‌కేసి చూశారు.

మీటరు చూసి చెప్పాడు రహీం. పైసలు చెల్లించి సందులోకి వెళ్ళిపోయాడాయన.

పైసలు పర్సులో వేసుకుంటూండగానే "ఏ-ఆటో! ఇధరావో!" అంటూ ఎదుటి ఫుట్‌పాత్‌నుంచి ఓ సూటువాలా పిలుపు వినిపించింది రహీంకు.

వెంటనే ఆటో స్టార్టుచేసి, సైడ్స్ చూసుకుంటూ అటుగా తిప్పేశాడు ఆటోని. అక్కడ ఆపేశాడు.

క్షణంలో ఆ సూటువాలా ఆటో ఎక్కి కూర్చుని, "జల్దీ చలో! ఎ.జి. ఆఫీస్" అంటూ గమ్యం కూడా చెప్పటం జరిగిపోయింది.

రహీం అంతకన్న తొందరగా ఆటోని మళ్ళా స్టార్టు చేశాడు.

ఆటో వేగం పుంజుకుంది.

సూటువాలా తన లెదర్‌బాగ్ తెరచి అందులో కాగితాలు, కవర్లు తీసుకొని చూసుకుంటున్నాడు.

ఒకటి రెండు కవర్లలోంచి కాగితాలు తీయడం, చదువుకోడం, మళ్ళా అందులో పెట్టేయడం-ఇదంతా రహీం ఫ్రంట్ మిర్రర్‌లోంచి గమనిస్తూనే వున్నాడు.

ఎవరో గొప్ప ఆఫీసరై ఉంటాడు-అనుకున్నాడు రహీం.

పదిహేను నిమిషాల్లోనో, ఇరవై నిమిషాల్లోనో ఎ. జి. ఆఫీస్‌ముందు టక్కున ఆగింది ఆటో.

అంతే! ఆ సూటువాలా రహీం చేతిలో అయిదు కాగితం పెట్టేసి మీటరన్నా చూడకుండా ఆఫీస్‌లోకి వెళ్ళిపోయాడు.

మీటరు చూపిన రహీం మొహం తెల్లబోయింది.

టిప్పుతో కలిపినా మూడు రూపాయలు కాలేదు.

"ఏ ఛేంజ్ లేలో సాబ్!" అంటూ వెంటబడ్డాడు. కాని, ఆయన అప్పటికే ఆఫీస్‌లోకి జొరబడిపోయాడు.

"ఊ" అనుకొంటూ రహీం వెనక్కి తిరిగి వచ్చాడు.

ఆటోని కొంచెం పక్కగా పార్క్‌చేసి, అక్కడున్న పైప్‌దగ్గర రకుబోయి మొహంకడుక్కున్నాడు.

చేతిరుమాలుతో మొహం తుడుచుకుంటూ, 'ఇవ్వాళ అన్యాయంగా రెండు రూపాయలు సంపాదించానే' అని బాధ పడసాగాడు.

అందుక్కారణం లేకపోలేదు.

రహీంకు చిన్నప్పటి మంచీ అన్యాయమన్నా, అసత్యమన్నా-పరమ అసహ్యం.

చిన్నప్పుడు చదువుకునే రోజు ల్లోనే సత్యహరిశ్చంద్రుడని అందరూ అతన్ని హేళన చేసే వారు.

అయినా అతనేం లెక్క చేసే వాడు కాదు.

పెద్దయ్యాక కూడా ఎన్నో చోట్ల ఉద్యోగానికిచేరి, ఈ ఒక్క విషయంలో-అంటే అసత్యమాడ టంతో రాజీపడలేక ఉద్యోగాలు వదులుకుని పెళ్ళాం పిల్లలను కూడా పస్తులు పడుకోబెట్టాడు.

ఆఖరికి స్వయం ఉపాధి పథకం క్రింద యీ ఆటోని తీసు కొని ఎవరినీ అన్యాయం చేయ కుండా, అసత్యమాడకుండా జీవ నం గడుపుకొస్తున్నాడు.

అలాంటిది యివ్వాళ రెండు రూపాయలు యెక్కువ తీసు కున్నానే—అని బాధపడుతూ తన బండిదగ్గర కొచ్చాడు.

తలగుడ్డ తీసి ఒకసారి సీటు శుభ్రంగా దుమ్ములేకుండా తుడ వాలని ఆటోలోకి తల దూర్చాడు.

సీటు తుడుస్తున్న అతని చేయి తక్కువ ఆగిపోయింది.

సీటుపక్కనున్న ఖాళీలో ఒక కవరు కనపడ్డంతో, రహీం చేష్ట లుడిగినవాడిలా ఆగిపోయి, ఆలో చనలో పడ్డాడు-కవరు ఎవరిదై ఉంటుందా:—అని.

'ఆ-యింకా యెవరిది: ఆ సూటు వాలాదే: దోవ పొడుగునా లెదర్ బాగ్‌లోంచి కవర్లు, కాగి తాలు తీసి చూసుకోవడం తానూ చూశాడుగా: పాపం-అది ఏమన్నా ముఖ్యమైన కాగితాలున్న కవ రేమో:' అనుకుంటూ ఆ కవర్ని తీశాడు

కవరు తెరచి చూశాడు.

అంతే: కళ్ళు తిరిగి మూర్ఛ పోయినంత పనయింది.

కాని అంతలోనే తేరుకుని చుట్టూ చూశాడు-దగ్గర్లోనే వున్న ఆటో ఫ్రెండ్స్ ఎవరన్నా చూస్తు న్నారేమోనని. అదృష్టం: ఎవరూ యిటుకేసి చూడడం లేదు ఎవరి గొడవల్లో వాళ్ళున్నారు.

దాంతో కొంచెం ధైర్యం వచ్చింది. లోపలికెక్కి కూర్చు న్నాడు.

కవరులో కాగితాలు తీసి చూశాడు. తొంభై రెండు కాగితా లున్నాయి-వందకాగితాలు.

అంటే—తొమ్మిదివేల రెండు వందలన్నమాట:

అంతే: కాగితాలన్నీ మళ్ళీ యథాప్రకారం కవరులో పెట్టేశాడు.

కవర్ని చేతుల్తో గట్టిగా పట్టు కుని కూర్చున్నాడు.

'ఇంత డబ్బు ఆ సూటువాలాదే తప్ప యింకెవరిదీ అయివుండదు. ఈ డబ్బుని భద్రంగా ఆయనకు అప్పచెప్పేయాలి. అప్పుడు ఆయన ఆనందంతో, ఆశ్చర్యంతో- తనని అమాంతం కౌగలించుకున్నంత పనిచేసి మెచ్చుకుంటాడు. 'ఆటో డ్రైవర్లంతా దొంగలు, వాళ్ళని నమ్మడానిక్కూడా వీల్లేదు. వాళ్ళంతా దగాకోర్లు, మోసగాళ్ళు...' యిలాంటి నిందలు వేసేవాళ్ళందరికీ తన నిజాయితీ ఒక చెంప దెబ్బ లాంటిది అవ్వాలి!

'ఆటో డ్రైవర్లకి నీతి నిజాయితీ ఉన్నాయి. వాళ్ళు మర్యాదస్తులే! పాసింజర్లని ఏం మోసం చేయరు-' అని తాను ఋజువు చేయాలి. తనలాంటి వాడు నూటికొక్కడున్నా ఆటో డ్రైవర్లందరికీ మంచి పేరు వచ్చి తీరుతుందని ఆ సూటువాలా అందరితోమా చెప్తాడు. అంతేనా? తెల్లారి పేపర్లనిండా యిదే వార్త 'ఆదర్శమూర్తియైన ఆటో డ్రైవర్ రహీం'-'నిజాయితీకి మారుపేరు రహీం'లాంటి హెడ్డింగులతో యీ ఉదంతం అంతా పేపర్లనిండా ప్రకటించేస్తారు. దాంతో పత్రికా విలేఖర్లు వచ్చి తన గురించి యెన్నెన్నో వివరాలు అడుగుతారు.

'అంతేనా? ప్రభుత్వం కూడా యీ విషయాన్ని తెలుసుకుంటుంది. అందుకు తగిన బహుమతిని కూడా తనకు యిస్తుంది.

'డబ్బు కోసం నానా గడ్డీ కరిచే పెద్దల్ని యెంతమందిని తాను రోజూ చూడ్డం లేదూ! ఏమవుతున్నారు అలాంటి వాళ్ళంతా? తాత్కాలికంగా సుఖపడ్డా, ఆఖరికి అందరిలో నూ అవమానాల పాలై, అప్రతిష్ఠ పాలై, అందరి చేత 'ఛీ-ఛీ' అనిపించుకుంటూ—నశించిపోతున్నారు.

'ఎంత సంపాదిస్తేయేం? చివరకు ఏం పట్టుకెడుతున్నారు? అందుకే డబ్బంటే తనకెప్పుడూ దురాశ లేదు. న్యాయంగా, కష్టపడి సంపాదించినదే అసలైన, సిసలైన సొమ్మని తన నమ్మకం!

'ఇవాళ యింత సొమ్ము—ఒక్కసారి అనుకోకుండా, అదృష్టవశాత్తూ తనకు దొరికిందేననుకో! అంతమాత్రాన-దాన్ని తన స్వంతం చేసుకొంటాడా? వీల్లేదు! అలా తీసేసుకుంటే అది అన్యాయార్జితమే అవుతుంది. ఆ డబ్బు దాని యజమాని దగ్గరకే చేరాలి' అనుకుంటూ ఆలోచనలో పడ్డ రహీం దగ్గరకు, మరొక ఆటో డ్రైవరు వచ్చాడు.

"క్యా రహీం భాయ్! బంజారా

హిల్స్ కట కిరాయికి పోతావా?" అన్నాడు.

మంచి కిరాయే! రహీం ఆలోచనలో పడ్డాడు. 'తానా కిరాయికి ఒప్పుకుంటే-యీలోగా యీ పెద్ద మనిషి పాపం-తిరిగొచ్చేస్తాడేమో?'

"నై-నై భాయ్! యిక్కడ యింకో బేరం ఉండాది" అంటూ ఆ మిత్రుణ్ని పంపేశాడు.

'అదృష్టం! అతను తన చేతిలో కవరు చూశాడు కాదు. చూస్తే? అమ్మో! యింకేమన్నా ఉందా? అందర్నీ పిలిచి-తన అదృష్టాన్ని పొగిడి పార్టీ చేయాలంటూ ప్రాణం తీసేసేవాడు. మొన్నేం జరిగింది? ఆ యాదయ్య ఆటోలో దొరికిన పర్సులో ఉన్న వంద రూపాయల చిల్లరతో అక్కడున్న డ్రైవర్లంతా జల్సా చేయలేదూ? అలాగే తననూ బలవంతం చేసేవాడు.

'అరె—యీ సూటువాలా లోపలికెళ్ళి అర్ధగంట దాటిందే! యింకా బయటికి రాడేంటి చెప్మా? అనవసరంగా యీ వెయిటింగ్ వల్ల కిరాయి కూడా పోయేట్టుంది. అసలు ఆ సూటూవాలా యింకా చూసుకున్నాడో-లేదో? పాపం! అదుగో-అయనే! అవును-అను మానం లేదు. అరె-అటు వెళ్ళి పోతున్నాడే!'

"సార్-సార్!" అంటూ పరుగెత్తాడు రహీం.

"వన్నా?" అంటూ ఆగాడు ఆ సూటువాలా.

"అవున్సార్! మిమ్మల్నే" అన్నాడు రహీం చేతిలో వున్న కవరు గట్టిగా పట్టుకుంటూ.

"ఏం? మీటరు ఛార్జి ఎక్కువైందా?" అన్నాడు ఆ వ్యక్తి.

"నో-నో సార్! ఈ కవర్..." అంటూ అతని చేతికి అందిస్తూ, "దిగి పోయేటప్పుడు ఇందాక మర్చిపోయారు సార్!" అన్నాడు రహీం.

ఆ సూటువాలా అనుమాని స్తూనే, ఆశ్చర్యం కనపడనీయ కుండా ఆ కవరందుకొని తెరచి చూచాడు.

అతని కళ్ళు చెదిరిపోయా, అతనికి మూర్ఛ వచ్చినంత పనైంది. అయినా పైకి కనపడనీయకుండా చుట్టూ ఒకసారి చూసి, ఏదో గుర్తు వచ్చినట్లు గబగబ తన లెదర్ బాగ్ తెరచి చూసుకున్నాడు.

తన ముఖంలో సంతోషం పులుముకుని, "థాంక్స్! మీ మేలు మర్చిపోలేను. మీకు....మీకు.... ఏం ప్రెజెంటు...." అనబోయాడు ఆ వ్యక్తి.

"నో-నో సార్! అది నా

డ్యూటీ. నా పాసెంజర్స్ ఏదన్నా మర్చిపోతే వారి సరుకు వారికి అప్పచెప్పడం నా విధి" అన్నాడు ఆనందాతిశయంతో.

అంతే! క్షణంలో ఆ వ్యక్తి 'థాంక్స్' అంటూ గబగబా పరుగెత్తుతూపోయి అప్పుడే కదలబోతున్న సిటీబస్ ఎక్కి వెళ్ళిపోయాడు.

'హమ్మయ్య!' అనుకుంటూ గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు రహీం.

కాని, అంతలోనే అతని మనస్సు ఒక్కసారి చివుక్కుమన్నది.

'తానాశించినట్లు ఆ వ్యక్తి పది మందిలోనూ తన నిజాయితీ గురించి చెప్తాడనీ, పదిమందీ తనను గుర్తిస్తారనీ, పేపర్లో ప్రకటనపడుతుందనీ- ప్రభుత్వం తనకు బహుమతి కూడా ఇస్తుందనీ-తాను అనుకున్నవన్నీ....అలాగే మిగిలిపోయాయి. పోనీ తనను ఎవరు గుర్తించినా గుర్తించకపోయినా, తన మనస్సే తనకు సాక్షి! తన అంతరాత్మ చెప్పినట్లే నిజాయితీగా చేశాడు. అంతే- చాలు!' అనుకుంటూ కిరాయి తగలగానే వెళ్ళిపోయాడు అక్కడ్నుంచి రహీం.

ఆ సాయంత్రం ఆబిడ్స్ సెంటర్‌లోకి వస్తున్న రహీం ఆటోకి అడ్డం పడ్డట్టుగా వచ్చాడు రామయ్యగారు భోరుమని ఏడుస్తూ.

సడెన్‌గా బ్రేకువేసి ఆటోని ఆపేశాడు రహీం.

ఇంతలో నలుగురూ పోగయ్యారు.

ఆటోని సైడుకు తీశాడు రహీం.

"క్యా రహీం! ఈయనగారు పొద్దుట నీ ఆటో ఎక్కారటగా?" అంటూ అడిగాడొక ఫ్రెండ్.

"ఈ ఆటోయే బాబూ! నాకు గుర్తే! నాయనా! పిల్లలుగలవాణ్ని, నా డబ్బు నాకిచ్చేయ్! పిల్ల పెళ్ళి కని అప్పు తెచ్చాను- పదివేలు" అంటూ కండువాతో కళ్ళు తుడుచుకుంటూ ఏడ్చేస్తున్నాడు రామయ్యగారు.

"ఉండండి! ఏడిస్తే ఏం లాభం? మా రహీంభయ్యా అలాంటివాడు కాదు. నిప్పులాంటివాడు. అతనికి దొరికితే-అతను తప్పకుండా ఇచ్చేసాడు. ఒకవేళ ఇంకెక్కడన్నా పోతే...."

"లేదు బాబూ! పదివేలు అప్పు దొరకగానే ఎనిమిది వందలు పెట్టి బట్టలు మాత్రం కొన్నాను- మిగతా తొంభై రెండు-వంద కాగితాలు కవర్లో పెట్టుకున్నాను.

బట్టలకొట్లో డబ్బు యిచ్చేశాక కవరు లాల్చీ జేబులోనే భద్రంగా దాచుకున్నాను. ఆ తర్వాత ఆటో యెక్కి చిక్కడ పల్లిలో దిగి యింటికెళ్ళి చూసుకునేసరికి...." అంటూ మళ్ళీ ఏడుపు ప్రారంభించారు రామయ్యగారు.

రహీం బుర్ర తిరిగిపోతోంది.

'ఏమిటి యీ ముసలాయన చెప్పేది? నిజమా—అబద్ధమా? నిజం కాకపోతే నిక్కచ్చిగా కవరు, అందులో వుంచినవి వందకాగితాలు తొంభై రెండు అని—ఎలా చెప్ప గలడు? ఆయన చెప్పేదే నిజం! అయితే మరి ఆ నూటువాలా?....'

"ఏం భాయ్! నీకేం కనపడ లేదా కవరు?" అంటూ అడిగాడింకో డ్రైవరు.

"అరె! మన రహీంనే అనుమా నిస్తున్నావట్రా? మన మన్నా యింకా కక్కుర్తిపడతామేమోగాని మన రహీం మాత్రం...." అన్నాడింకోడు.

"పిల్ల పెళ్ళి ఆగిపోతుంది బాబూ! యిక ఆ పిల్లదానికి పెళ్ళయ్యే యోగ్యతే లేదు కాబోలు! ఏం నాయనా! మాట్లాడవేం? తీస్తే చెప్పు బాబూ! చచ్చి నీ కడుపున పుడతాను" అంటూ రామయ్యగారు అంతమందిలోనూ రహీం కాళ్ళు పట్టుకోబోయాడు.

ఇంతలో ఓ పెద్దమనిషి వచ్చి, సంగతంతా విని, "అలా చూస్తూ ఊరుకుంటే లాభంలేదండీ! పద వండి పోలీసు కంప్లెయింటు యిద్దాం. వీళ్ళంతా దొంగలే!" అంటూ రామయ్యగార్కి ధైర్యం చెప్పాడు.

"ఏంటండీ! ఎందుకు పోలీసు కంప్లెయింటు? ఎక్కడో పోగొట్టు కొని, ఆటోలో యెక్కినంత మాత్రాన ఆటోలోనే పోయినట్టు- ఆ డ్రైవరు దొంగయినట్టునా? యివ్వండి పోలీసు కంప్లెయింటు. మా రహీంకేం భయమా? మా వాడు అట్టాటి యెధవ పని యెప్పుడూ చేయడు" అంటూ ఓ ఆటో డ్రైవరు ముందుకొచ్చాడు.

అక్కడనుంచి గుంపంతా పోలీసుస్టేషను వైపుకు కదిలింది.

ముందు రామయ్యగారితో సహా ఓ పదిమంది పెద్దలు, మధ్యలో రహీం, వెనక ఆటో డ్రైవర్లు ఓ పదిహేనుమంది.

స్టేషనులో సబిన్స్పెక్టర్ లేడు. వచ్చేదాక అక్కడే వెయిట్ చేయమన్నారు.

రహీం మనస్సు మనస్సులో లేదు. 'ఇంకో క్షణంలో సబిన్ స్పెక్టరు వస్తాడు. ఆయనకు తన

సంగతి ఎంతో బాగా తెలుసు.

'ఏం రహీం! కవరేమన్నా దొరికిందా?' అని అడుగుతాడు. తాను తప్పక నిజమే చెప్తానని ఆయనకు గట్టినమ్మకము—విశ్వాసము. తన మాట మీదే ఆయనకు గురి. దాని ప్రకారము తదుపరి చర్య తీసుకుంటాడు. అలా అడిగితే ఏం చెప్పాలి? నిజమే చెప్పాలి- నిజమే చెప్పాలి! నిజమంటే ఏది? వేరే నిజమేముంటుంది? తనకు కవరు దొరికిందనే చెప్పాలి! దొరికితే ఏది ఆ కవరు? ఆ సూటువాలాకిచ్చానని మళ్ళీ నిజం చెప్పాలి! ఆ సూటువాలా ఎవరు? ఏమో—తనకు తెలియదు. అది నిజం! ఆ నిజం చెప్తే ఎవరూ నమ్మరు. హే అల్లా! ఒకప్పుడు నిజం చెప్పినా జనం నమ్మరంటారు యిదేగాబోలు!

'ఆ సూటువాలాకు తనకు సంబంధం ఉందనీ, తనకు దొరికిన ఆ డబ్బును ఆ సూటువాలాద్వారా దాచేశానని అంతా తననే అంటారు. ఆ సూటువాలా ఎవరో యధార్థంగా తనకు తెలియదన్న నిజం చెప్పినా, యిక యెవ్వరూ నమ్మరు. ఏం చేయాలి? ఆ సూటువాలా సంగతి చెప్పకూడదు. ఆ సూటువాలా సంగతి చెప్పకపోతే, యిక ఆ కవరుకు తనే బాధ్యత వహించాలి. అంటే ఆ కవరులో పైకం తాను తీసికొన్నట్లు ఒప్పుకోవాలి. ఆ పైకం ఆయనకు తిరిగి తానే యివ్వాలి. అమ్మో! అంత సొమ్మే! ఎన్నాళ్ళు శ్రమపడితే అంత సొమ్ము కూడబెట్టగలడు? ఏది ఏమైనా ముందు తనని అరెస్టు చేయడం ఖాయం. కవరు దొరికిందన్న నిజం చెప్పక తప్పదు. అలా దొరికిందని చెప్పినందుకు గాను—ముందు ఒకరకమైన శిక్ష- దొరికిన సొమ్ము ప్రభుత్వానికి యివ్వక పోవడం నేరమంటూ— మరో శిక్ష....

ఒక్క నిజం చెప్పినందువల్ల యిన్ని యిబ్బందులా?'

స్టేషన్‌లోకి ఎస్సైగారు రావటంతోటే కొంచెం కలకలం చెలరేగింది. ఎస్సైగారు రహీంను గుర్తించాడు. రామయ్యగారు భోరున ఏడుస్తూ జరిగినదంతా చెప్పుకున్నాడు.

ఎస్సైగారంతా సావధానంగా విన్నాడు.

"మావాడు అట్టాటి పనెప్పుడూ చెయ్యడుసార్! ఆయనే యెక్కడో పారేసుకుని........" అన్నాడో డ్రైవరు. "ఏం రహీం! అంతేనా?" అంటూ ఎస్సైగారు రహీం కేసి

తిరిగి చూస్తూ అడిగాడు.

రహీం ఏం చెప్పాలా అని ఆలోచించసాగాడు.

"ఏం రహీం! మాట్లాడవేం? ఆ కవరేమన్నా నీ ఆటో లో పడిందా?" ఎస్సైగారి ప్రశ్న.

రహీం ఒక్కసారి తలపైకెత్తి ఎస్సైగారికేసి జాలిగా చూశాడు.

"చెప్పు రహీం! నీ మాట మీద నాకు నమ్మకముంది. నువ్వు చెప్పేది నిజమని మా కందరకు తెలుసు" అన్నాడు ఎస్సైగారు.

"చెప్పు బాయ్! నీ కేంటి భయం? నీకు దొరకనికాడికి నీకేం భయం?" అంటూ ప్రోత్సహించాడో డ్రైవరు.

క్షణంసేపు రహీం మనస్సు ఊగిసలాడింది! మానసిక సంఘర్షణ చెలరేగింది!

నిజంచెప్పేసి నీ నిజాయితీని మరోసారి ఋజువుచేసికొమ్మంటోంది మనసు.

నిజం చెప్పి అనవసరంగా యెందుకు అవస్థల పాలవుతావు- అని అదే మనసు ఘోషించింది.

'నాకేం తెలియదు' అని ఒక్క మాట చెప్తే ఎస్సైగారు వది లేస్తారు.

కాని—కాని....

"ఏం రహీం! ఏమిటి ఆలో చిస్తున్నావు?" అన్నారు అతరు సారిగా ఎస్సైగారు.

"ఏం లేదు సార్!"

"ఆ కవరు నీకు దొరికిందా?" మళ్ళీ అడిగాడు.

అంతా చెవులు నిక్కబెట్టుకొని, ప్రాణాలు ఉగ్గబట్టి వింటున్నారు ఏం చెప్తాడోనని!

"ఆ కవరు నాకు దొరికింది సార్!" అన్నాడు ఒక్కసారిగా రహీం.

అందరూ తెల్లబోయారు.

రామయ్యగారి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

అంతే! ఆటో డ్రైవర్లంతా అక్కడినుంచి ఒక్కొక్కళ్ళే మెల్లగా జారుకున్నారు.

జరిగిందంతా రహీం చెప్పాడు.

ఆ తర్వాత జరగవలసిన తతంగమంతా జరిగింది. కేసు సాగింది. నాలుగు నెలల తర్వాత కేసు విచారణ పూర్తయింది.

ఆశ్చర్యం! 'ముద్దాయి తప్పు ఒప్పుకున్నంత మాత్రాన శిక్షించటానికి వీల్లేదు. ముద్దాయి నేరం చేసినట్లు ఋజువు చేసే సాక్ష్యాల్ని పొందు పరచలేక పోయా'రంటూ కేసు కొట్టేశారు.

ఒక్కసారి తృప్తిగా నిజం నిట్టూర్చింది! ●